ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025

అమ్మ దిద్దిన ఐఏఎస్‌లు



అమ్మకి మరోపేరే త్యాగం. ఓర్పు, నేర్పు.. అమ్మదనంతో అలవోకగా అలవడే లక్షణాలు. బిడ్డల కోసం జీవితంతో పోరాడే ధీశాలి. భూదేవితో తప్ప అమ్మను మరిక దేనితోనూ పోల్చలేం. అందుకే.. 'తానుండలేని తావులో తనకు బదులుగా దేవుడు అమ్మని సృష్టించాడు' అని చెబుతారు. కని, పెంచిన కష్టం మాత్రమే కాదు.. బిడ్డల బంగారు భవిష్యత్తుకూ అమ్మ రూపశిల్పి. అమ్మ పట్టుదలకూ, ప్రేమకూ, అమ్మకన్న కలలకూ ప్రతిరూపాలే పిల్లలు. అమ్మ తీర్చిదిద్దిన ఈ బిడ్డలు ఐఏఎస్‌లు అయ్యారు. వెంకటేశ్వర్.. తిరుపతి జిల్లాకు పరిపాలనా సారథ్యం వహిస్తున్నారు. మౌర్య తిరుపతి నగర పాలన బాధ్యతల్లో ఉన్నారు. వీరిద్దరు అమ్మల గురించి ఆంధ్రజ్యోతితో పంచుకున్న సంగతులు.. వారి మాటల్లోనే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మ పట్టుదల

● తిరుపతి నగర కమిషనర్ మౌర్య



నా విజయంలో సగం ఆమెదే

అమ్మ జయశ్రీ పెద్దచదవరి కాదు. మాది కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లి. పల్లెలో పుట్టి పెరిగిన అమ్మ.. బిడ్డల కోసం పెద్ద కలలు కనింది. ఆ కలలు నెరవేరడానికి కొండలా నిలబడింది. నా ఐఏఎస్ సాధనయాత్రలో అమ్మ కష్టం.. అమ్మ త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే! నాకు అమ్మంటే ఇష్టం. అమ్మకు చదవంటే ఇష్టం. అమ్మ కళ్లలో మెరుపుకోసం మరింత కష్టపడి చదివేదాన్ని. సివిల్స్ కోసం ఢిల్లీకి వెళితే అమ్మ నాతోపాటు వచ్చేది. ఢిల్లీలో చిన్న అద్దెగదిలో అమ్మా..నేనూ.. ఇద్దరమే ఉండేవాళ్లం. ప్రతి పరీక్షకూ అమ్మ నాతో పాటూ సెంటర్‌కు వచ్చేది. ఇంట్లోనే అన్నం కూరలూ చేసి తెచ్చేది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అక్కడే కాసుకుని ఉండేది. సివిల్స్‌కి నాలుగుసార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఇక సాధించగలనా? అన్న అనుమానం కలిగి అసంతృప్తిచెందినప్పుడు.. అమ్మ నాకు బాసటగా నిలచింది. వెన్నుతట్టి ప్రోత్సహించేది. చాలా ధైర్యం చెప్పేది. ఆ తర్వాత హైదరబాద్‌కు వచ్చేశాం. అక్కడ ఒక ఫ్లాట్ తీసుకుని ఐదోసారి సివిల్స్‌కు ప్రయత్నించా. అప్పుడు కూడా అమ్మ ఇల్లొదిలి వచ్చి నాతోపాటు ఉండిపోయింది. ఐదో ప్రయత్నంలో ర్యాంకు సాధించా. నా ఐఏఎస్ ప్రయత్నంలో కష్టం అమ్మదే. ఆ విజయంలో సగం అమ్మకే దక్కుతుంది.

ఇప్పుడూ ఆమే!

ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అమ్మ నాకు ఆసరాగానే ఉంది. విధి నిర్వహణలో ఎక్కువ సమయం బయట ఉండాల్సి ఉంటుంది. ఇప్పుడు కూడా ఇంట్లో ఎక్కువగా అమ్మ ఉంటుంది. మా బాబును ఆమే చూసుకుంటుంది. నాకు స్వేచ్ఛ ఇచ్చింది. విలువలు నేర్పింది. అమ్మ నా మార్గదర్శి కూడా. 62 ఏళ్ల వయస్సులో ఇప్పుడు కూడా ఆమె సలహాలు బాగా ఇస్తారు. ఏదైనా బాధ, సంతోషం కలిగినప్పుడు పెళ్లికి ముందు అమ్మతోనే షేర్ చేసేకునేదాన్ని. పెద్ద రిలీఫ్ అనిపించేది. ఇప్పుడు భర్తతో పంచుకుంటా.

పెళ్లికాక ముందే పుట్టినింటి భారం

అమ్మ పేరు కాశమ్మ. నర్సింగ్ కోర్సు చేశారు. ఇంటి పరిస్థితి అమ్మని పెళ్లి కాక ముందే సౌదీ అరేబియాకు చేర్చింది. అప్పటికి అమ్మ వయసు 19 ఏళ్లట. అక్కడ నర్స్‌గా ఉద్యోగం చేస్తూ అమ్మ నాన్నా అమ్మలకు, తోబుట్టువులకు అండగా నిలిచారు. పెళ్లి తర్వాత కూడా చాలా వరకూ వారి మంచిచెడ్డలు పట్టించుకున్నారు.

చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా!

అమ్మ ఇరవై ఏళ్ల సౌదీ అరేబియాలో ఉద్యోగం చేశారు. పెళ్లయ్యాక, మేము పుట్టాక కూడా అక్కడే కొనసాగారు. ఏడాదికి రెండుసార్లు వచ్చి మమ్మల్ని చూసి వెళ్లేవారు. చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా. నేనే కాదు మా అన్న, అక్కలు అందరికీ ఆ వెలితి ఉండేది. అప్పట్లో అమ్మ మాతో లేకపోవడం వల్ల ఒకటవ తరగతి నుంచే నన్ను హాస్టల్‌లో చేర్చారు. తర్వాత నా చదువంతా అలానే హాస్టల్‌లోనే గడిచింది.



ఆమె కష్టాల్నూ, త్యాగాల్నూ వెలకట్టలేను!

మాది పెద్ద కుటుంబం. ఐదుగురు పిల్లలం. ఒక అన్న, ముగ్గురు అక్కల తర్వాత నేను. అంతమందిని చదివించి పెంచి పెద్ద చేయడం అంటే మాటలు కాదు. అమ్మ ఉద్యోగం వదులుకుని వచ్చేశాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. వాటి తీవ్రత, అమ్మ పడిన కష్టాల గురించి అంతకుమించి చెప్పలేను. మా కోసం తను పడిన కష్టాలు, చేసిన త్యాగాలకు వెలకట్టలేను.



అమ్మ కల ఇది!

● కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

మాకోసం కెరీర్‌నే వదులుకున్నారు!

మా కోసం అమ్మ తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను పూర్తిగా వదులుకున్నారు. నేను హైస్కూలు చదువు స్థాయికి వచ్చేసరికి ఎదిగే వయసులో పిల్లలతో గడపాలని, మా మంచి చెడ్డలు చూడాలని సౌదీ అరేబియాలో ఉద్యోగం వదిలిపెట్టేసి వచ్చేశారు. నిజానికి సౌదీలో ఇరవై ఏళ్ల అనుభవం ఉన్నందున ఇక్కడికి వచ్చాక సిటీల్లో ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా మంచి ఉద్యోగంలో చేరే అవకాశం ఉండింది. కేవలం మా కోసమే అమ్మ అలాంటి ప్రయత్నం చేయలేదు. మాతోనే ఉండిపోయి తన కెరీర్‌నే పూర్తిగా వదులుకున్నారు.

అమ్మ కల.. నా ఐఏఎస్

నేను చిన్నప్పటి నుంచీ చదువులో చురుకుగా ఉండేవాడిని. అది గమనించిన అమ్మ.. నువ్వు ఐఏఎస్ చేయాలి అనేది. అది చిన్నపుడే నాలో నాటుకుంది. అమ్మకి ఆ కోరిక ఎందుకు కలిగిందంటే.. 2001లో మా సొంత మండలం కొమరోలు (ప్రకాశం జిల్లా) జడ్పీటీసీ స్థానం బీసీ మహిళలకు రిజర్వు అయింది. బీసీ జనరల్ అయివుంటే నాన్న వెంకటయ్య పోటీ చేసివుండేవారు. మహిళకు రిజర్వు కావడంతో అమ్మ పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచారు. నాన్న కూడా సర్పంచుగా, జడ్పీటీసీగా పనిచేశారు. ప్రజాప్రతినిధులు కావడం వల్ల వారికి కలెక్టర్ వంటి ఐఏఎస్ అధికారులను కలిసే అవకాశం ఉండేది. దాంతో నన్ను ఐఏఎస్ ఆఫీసర్‌గా చూడాలన్న ఆశ, పట్టుదల అమ్మకు ఇంకా ఎక్కువైంది. ప్రతి సందర్భంలోనూ ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఉండేవారు. అందుకే మెడిసిన్ పూర్తి చేసినప్పటికీ డాక్టర్‌గా కొనసాగకుండా కేవలం అమ్మకోసమే సివిల్స్ వైపు దృష్టి మళ్లించా. తొలి రెండు ప్రయత్నాలలో ఆలిండియా సర్వీసస్‌కు ఎంపికైనా అమ్మ కోసమే పట్టుదలగా ప్రయత్నించి మూడవసారి ఐఏఎస్ సాధించా. ఆ క్షణం అమ్మ పడిన సంబరం, సంతోషం వర్ణించలేను. తనే ఐఏఎస్ సాధించినట్టు ఫీలయ్యారు. ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరిన రోజు నా కుర్చీలో కూర్చోబెట్టినపుడు అమ్మ కళ్లలోని ఆ మెరుపులు చాలు నా జీవితానికి అనిపించింది. అలాగే రిపబ్లిక్ డే ఉత్సవాలలో రాష్ట్రపతి ప్రతినిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం, పోలీసు గౌరవ వందనం స్వీకరించడం వంటి సందర్భాలు ప్రత్యక్షంగా చూసిన అమ్మ గర్వపడిన క్షణాలను ఎప్పటికీ మరచిపోలేను. పిల్లల కోసం ఇన్ని త్యాగాలు చేసిన అమ్మకు సంతోషం కలిగించడం తప్ప ఇంకేం ఇవ్వగలం.. అమ్మ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.. ఏ బిడ్డలకైనా!

తిరుమలలో 'ఆపరేషన్ గరుడ'



తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ సరిహద్దులో యుద్ధ వాతావరణం నేపథ్యంలో తిరుమలలో ఆక్టోపస్ బలగాలు శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. సామాన్యులు బస చేసే యాత్రికుల వసతి సముదాయం-3(పీఏసీ)లో 'ఆపరేషన్ గరుడ' పేరుతో గంటన్నర పాటు ఈ ప్రక్రియ చేపట్టాయి. భక్తులు భయాందోళనకు గురికాకుండా ముందస్తుగానే దీనిపై ప్రచారం చేశారు. భక్తులను, సిబ్బందిని బందీలను ఎలా రక్షించాలి, ఉగ్రవాదులను ఎలా అంతమొందించాలనే అంశాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. నలుగురు ఉగ్రవాదులు తరహాలో ఆయుధాలతో వసతి సముదాయం-3లోకి ప్రవేశించారు. వెంటనే వీఎస్వో తమ ఉన్నతాధికారులతో పాటు ఆక్టోపస్ బేస్‌క్యాంప్‌కు సమాచారమిచ్చారు. వారు ఆయుధాలతో చేరుకున్నారు. మూడు హాళ్లలో నక్కి ఉన్న ఉగ్రవాదులను అంతం చేయడంతో పాటు వారి బంధీలుగా ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్టుగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇందులో ఆక్టోపస్ తో పాటు విజిలెన్స్, సివిల్ పోలీసు, ఏఆర్, ఏపీఎస్పీ, ఫైర్, బాంబ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయని డీఎస్పీ విజయ్‌శేఖర్ మీడియాకు వివరించారు.

విమానాశ్రయంలో ...



రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులు విమానాశ్రయంపై దాడి చేస్తే ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, ఎయిర్‌పోర్ట్ భద్రతా దళాల కమాండెంట్ బహదూర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉగ్రవాదులను ఎదుర్కోవడం, ప్రయాణికులను సురక్షితంగా బయటకు తరలించడం, గాయాల పాలైన వారిని ఆస్పత్రికి తరలించడం, ఉగ్రవాదులను చుట్టుముట్టడం, మట్టుపెట్టడం వంటి విన్యాసాలు చేశారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ ఇన్‌చార్జి పీడీ భూమినాథన్, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ మంజునాథరెడ్డి పాల్గొన్నారు.



షార్‌లో..

సూళ్లూరుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సతీష్ థావన్ అంతరిక్ష కేంద్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా శనివారం షార్‌లోని గేటు 1బి సమీపంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. షార్ కేంద్రాన్ని భద్రత వలయంలోకి తీసుకొన్నారు. సీఐఎస్ఎఫ్ డీఐజీ సంజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసు, మెరైన్ అధికారులతో భద్రతపై చర్చించారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎన్‌కే గౌర్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మకు వెంకన్న సారె

● తిరువీధులలో ఘనంగా ఊరేగింపు





తిరుమల నుంచి సారె తీసుకొస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, ఛైర్మన్ బీఆర్ నాయుడు - సారెను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందజేస్తున్న దృశ్యం

తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : గంగ జాతరను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు టీటీడీ ఆనవాయితీగా అందజేసే మేల్‌చాట్, పసుపు, కుంకుమ (సారె) శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు సాయంత్రం 4గంటలకు స్థానిక గోవిందరాజ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందజేశారు. అక్కడి నుంచి కర్నాలవీధి, గాంధీరోడ్డు, బండ్ల వీధి, పెద్దకాపు వీధి మీదుగా అమ్మవారి సారె ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు ముందు కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. పలువురు లయబద్ధంగా నాట్యం చేస్తూ ఊరేగింపునకు జాతర కళను తెచ్చిపెట్టారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, అన్న కుమారుడు శివలు నృత్యం చేసి సందడి చేశారు. కాగా, శనివారం భక్తులు దొరవేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కైకాల కులస్థులు దొర వేషాన్ని, చాకలి కులస్థులు మంత్రి వేషాన్ని వేశారు.

● నేడు మాతంగి వేషం

గంగజాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం మాతంగి వేషాన్ని భక్తులు ధరిస్తారు. తలకు పసుపుగుడ్డను జడలా కట్టి కొప్పుముడివేసి దానికి మల్లె పూలను చుట్టుకుంటారు. శరీరమంతా గంధం పూసుకుని తెల్ల చీర, లేదా పసుపు చీర కట్టుకుని రవిక తొడుక్కుంటారు. మెడలో పూలహారం వేసుకుంటారు. ఒడిబాల కట్టుకుని అందులో అక్షింతలు, దువ్వెన, భరిణి, రవిక, పసుపు, కుంకుమలు పెట్టుకుంటారు. మాతంగి వెయ్యికళ్ల దేవతని ముఖానికి, ఒళ్లంతా నల్లని ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేస్తూ వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.



● గంగమ్మకు వజ్రపు తిలకం బహూకరణ

తాతయ్యగుంట గంగమ్మకు మంత్ర మహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వజ్రపు తిలకాన్ని బహూకరించారు. శనివారం సారె సమర్పించిన ఆమె రూ.2లక్షల విలువైన వజ్రపు తిలకాన్ని ఈవో జయకుమార్‌కు అందజేశారు.

చెరువు భూమిని మింగేస్తున్నారు

● కరకంబాడి చెరువులో 50 ఎకరాల ఆక్రమణ
● ఏకంగా రోడ్డు నిర్మాణం
● ముంపు భూమిని కమర్షియల్‌గా మార్చేస్తున్న వైనం



రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకంబాడీ చెరువు చుట్టూ 50 ఎకరాలు ఆక్రమణకు గురైంది. చెరువులో ఏకంగా రోడ్డు ఏర్పాటు చేసుకుని ముంపు భూమిని కమర్షియల్‌గా మార్చేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కరకంబాడీ చెరువు 130 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం కరకంబాడీ-తిరుపతి ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న భూముల్లో మట్టిపోసి చదును చేస్తున్నారు. వాస్తవంగా చెరువు ముంపు పట్టా భూముల్లో వ్యవసాయం చేసేవారు. పట్టాలు పొందిన రైతులు వాటిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించినట్లు తెలుస్తోంది. కొనుగోలుదారులు చెరువులోకి నీరు రాకుండా కాసి రాళ్లతో గోడను నిర్మించుకున్నారు. ఇది చాలదన్నట్లు మెయిన్ రోడ్డు నుంచి ఏకంగా రోడ్డును ఏర్పాటు చేసుకుని మట్టితోలి పూడ్చి చెరువును పూడ్చి వేస్తున్నారు. సుమారు 50 ఎకరాలు ఆక్రమణకు గురైందని స్థానిక రైతులు చెబుతున్నారు. దీనిపై శ్రీకాళహస్తి ఇరిగేషన్ డీఈ ప్రకాష్‌రావును వివరణ కోరగా కరకంబాడీ చెరువు ఆక్రమలపై కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో స్థానిక మత్స్యకారులు ఫిర్యాదు చేశారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించాలని తహసీల్దార్‌ను ఆదేశించామని తెలిపారు. త్వరలోనే ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ కుంభాభిషేకం



ఎమ్మెల్యే నానికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

పాకాల, మే 10 (ఆంధ్రజ్యోతి): తోటతిమ్మయ్యగారిపల్లె పంచాయతీ వలపలవారిపల్లెలో వినాయకస్వామి గుడిలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. గ్రామస్థులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ఠ కుంబాభిషేక పూజలకు పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వలపల దశరథనాయుడు, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి. మండల టీడీపీ నాయకులు, పాల్గొన్నారు. కాగా దామలచెరువులో ఇటీవల హత్యకు గురైన సత్రసాల అశోక్ కుమార్ కుటుంబ సభ్యులను నాని పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

14నుంచి భద్రత కోర్సులపై ఉచిత శిక్షణ

చంద్రగిరి, మే 10(ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 14 నుంచి 13 రోజుల పాటు సీసీ కెమెరా ఇన్‌స్టాలింగ్, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టర్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ ఉమ్మడి జిల్లా గ్రామీణ ప్రాంతంలో తెల్ల రేషన్ కార్డు కలిగి 19 నుండి 40 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ పురుషులు శిక్షణకు అర్హులు. కనీసం పదోతరగతి చదివి ఉండాలి. అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవచ్చు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి కల్పించనున్నారు. శిక్షణ పూర్తయ్యాక సర్టిఫికెట్లు అందజేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే ఎంపిక చేయనున్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 7989680587, 9494951289, 6301717672 నంబర్లలో సంప్రదించాలని సురేష్‌బాబు సూచించారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

భాకరాపేట, మే 10(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ వర్గాల వారు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో గిడ్డయ్య కోరారు. మైనారిటీలకు రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిస్టియన్ వర్గాల వారికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. 50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు సెట్ల దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీనివా సమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించారు. బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. మాడ వీధుల్లో ఊరేగుతూ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా పాకాలలో ర్యాలీ

పాకాల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం సాయంత్రం వైసీపీ ఆధ్వర్యంలో సైనికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మండల నాయకులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండు నుంచి సాగిన ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి, ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ ఎస్.కస్తూరి, నాయకులు పాల్గొన్నారు.

చంద్రగిరి

చెట్టు నుంచి జారిపడి యువకుడు మృతి



మోహన్‌సాయి(ఫైల్‌ఫోటో)

చంద్రగిరి, మే 10(ఆంధ్రజ్యోతి): కోట గ్రామంలోని ఓ యువకుడు తాటి చెట్టు ఎక్కుతూ జారిపడి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన సిద్దయ్య కుమారుడు మోహన్ సాయి(24) బీటెక్ చదివాడు. ఇంటికి బంధువులు వచ్చిన క్రమంలో తాటి ముంజులు కోసం శనివారం సాయంత్రం సమీప పొలంలోని తాటి చెట్టు ఎక్కాడు, ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడ్డాడు. అపస్మారకస్థితిలోకి చేరుకున్న ఇతడిని స్థానికులు వెంటనే చంద్రగిరి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. తర్వాత మెరుగైన చికిత్సకు రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మోహన్ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి.

తిరుచానూరు టీడీపీ అధ్యక్షుడిగా కిషోర్‌రెడ్డి



కిషోర్‌రెడ్డి, సాయిరాయల్

తిరుచానూరు, మే 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామకమిటీ అధ్యక్షుడిగా కిషోర్‌రెడ్డి మరోమారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రఘునాథ్‌రిసార్ట్‌లో టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఈయన్ను ఎంపిక చేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా సాయి రాయల్ ఎన్నికయ్యారు. పరిశీలకుడిగా నరసింహారెడ్డి వ్యవహరించిన కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్,హరేరామ్‌రెడ్డి, కార్యకర్తలుపాల్గొన్నారు.

ప్లాటినం లయన్స్‌క్లబ్ కార్యవర్గం



తులసీరామన్-జయరామనాయుడు-రామయ్య

పాకాల, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకాల ప్లాటినం లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని శనివారం క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు చార్టెడ్ ప్రెసిడెంట్ జి.గురుస్వామినాయుడు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా కెఎన్ తులసీరామన్, ఉపాధ్యక్షుడిగా టి.జయరామనాయుడు, కార్యదర్శిగా జి.రామయ్య, కోశాధికారిగా ఎం.కుప్పుస్వామినాయుడు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గం ఈ ఏడాది జూలై వచ్చే ఏడాది జూన్ 2026 వరకు బాధ్యతలు నిర్వహిస్తారు.

ఘాట్‌రోడ్డులో ఎలుగుబంటి

● భక్తుల భయాందోళన

తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డుకు సమీపానికి ఓ ఎలుగుబంటి రావడంతో వాహనదారులు హడలిపోయారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే ఈ మార్గంలోని చివరి మలుపు వద్ద శనివారం ఎలుగుబంటి కనిపించింది. దీంతో ఇది రోడ్డు పైకి వచ్చి తమ మీదకు దాడికి దిగుతుందేమోనని అక్కడున్నవారు భయాందోళనకు గురయ్యారు. కొద్ది సమయం తర్వాత ఎలుగుబంగి అడవిలోకి వెళ్లిపోయింది. దీంతో హమ్మయ్య అంటూ భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

పాఠశాలలు తెరిచే నాటికే పుస్తకాలు

● రూరల్ మండలానికి ఇప్పటికే 80 శాతం పుస్తకాల చేరిక ● పూర్తి స్థాయిలో యూనిఫాం

తిరుపతి రూరల్, మే10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల తెరిచే రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట కిట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఎంఆర్‌పల్లె జెడ్పీహైస్కూల్ ప్రాంగణంలోని రూరల్‌మండల మండలస్టాక్ పాయింట్ కేంద్రానికి 80శాతానికిపైగా పాఠ్య పుస్తకాలు, పూర్తిస్థాయిలో యూనిఫాం చేరుకున్నాయని సమాచారం. మండలపరిధిలోని 47ప్రాథమిక, 10ఉన్నతపాఠశాలల్లో 4,886మంది చదువుతున్నారు..మొదటిదశలో 21,811పుస్తకాలను, యూనిఫాం సరఫరా చేశారు. 5వతరగతికి సంబంధించి రెండు టైటిల్స్, 7వతరగతికి సంబంధించి ఒక టైటిల్ పాఠ్యపుస్తకాలు రావాల్సిఉంది. కిట్‌లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్, నోటు పుస్తకాలు ఉంటాయి.

తగ్గనున్న బ్యాగు భారం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సెమిస్టర్లవారీగా పాఠ్యపుస్తకాలు, నాండిటేల్, వర్క్‌బుక్స్‌ని విడివిడిగా ఎక్కువసంఖ్యలో ఉండడంతో బ్యాగుల బరువు ఎక్కువగా ఉండేది. ఇక ఒక ట్రెండు తరగతులకు టెక్స్‌బుక్, వర్క్‌బుక్, 3-5తరగతులకు లాంగ్వేజస్, నాన్‌లాంగ్వేజస్‌ల కింద రెండు పాఠ్యపుస్తకాలు, రెండు వర్క్‌బుక్స్ చొప్పునటైటిల్స్ పుస్తకాలు ఉంటాయి. 6-7తరగతులకు మూడుపాఠ్యపుస్తకాలు మూడువర్క్‌బుక్స్, 8-10 తరగతులకు సబ్జెక్టుకి ఒకపాఠ్య పుస్తకం,వర్క్ బుక్ ఉంటుంది. పదవతరగతిలో సెమిస్టర్‌కి 11 పుస్తకాలు ఉంటాయి. దీంతో బ్యాగుల బరువు తగ్గనుందని భావిస్తున్నారు.



పాఠ్యపుస్తకాలు, యూనిఫాంని సరిచూస్తున్న ఎంఈవో-2 కె.శంకరయ్య, సిబ్బంది

పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం



ఇప్పటికే 80శాతానికిపైగా పాఠ్యపుస్తకాలు, పూర్తిస్థాయిలో యూనిఫాం వచ్చాయి. వచ్చేనెల మొదటివారాన్ని కల్లా పాఠశాలలకి పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. అడ్మిషన్లు పెరిగితే ఇండెంట్ పెట్టి తెప్పించుకుంటాం. **-చి.మహమ్మద్ రఫీ, ఎంఈవో-1**

ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



చంద్రగిరి, మే 10(ఆంధ్ర జ్యోతి): తిరుపతి బాలాజీకాలనీలోని ఎస్వీ సీసీ డిగ్రీ కళాశాల విద్యార్థులు సెమిస్టర్ ఫలితాల్లో ఎస్వీ యూనివర్శిటీ స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. మూడవ సంవత్సరం 5వ సెమిస్టర్ ఫలితాల్లో కళాశాల విద్యార్థులు బీకామ్(కంప్యూటర్స్, బీఎస్సీ(ఎంఎస్‌సీఎస్)లో విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. బీకామ్(కంప్యూటర్స్)లో శేఖర్ తేజ శ్రీ(8.91 శాతం), సురపగా జయశేఖర్(8.45 శాతం), మద్దూరి అనూష(8.2 శాతం), బీసెస్సీ(ఎంఎస్‌సీఎస్)లో కందుకూరి చర్విత(7.38 శాతం), మార్కులు సాధించారు. 99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

పార్కులో మందుబాబుల హల్‌చల్



పడేసిన ఖాళీ మద్యంబాటిళ్లు ,ప్లాస్టిక్ గ్లాసులు

తిరుపతి రూరల్, మే10 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లె పంచాయతీ కొప్పరవాండ్లపల్లె పార్క్‌ని మందుబాబులు అడ్డాగా చేసుకుని వీరంగం సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడుతుండగానే కొందరు గుంపులుగా మద్యం బాటిళ్లతో పార్క్‌లోకి చేరుతున్నారు. రాతి బెంచీలపై కూర్చుని అర్ధరాత్రివరకు తాగి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. ఆకతాయిలు మద్యం, మత్తుపదార్థాల తాగి ద్విచక్రవాహనాలను పెద్ద శబ్దాలతో నిద్ర కూడా పట్టనివ్వడంలేదంటున్నారు. ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటిళ్లని పార్క్‌లోనే పడేసి వెళ్లిపోతున్నారు. పార్క్ ఉన్నా సాయంత్రవేళలో పిల్లలతో కలసి రాలేకపోతున్నామంటున్నారు. మండలో శివారుప్రాంతం కావడంతో పోలీసుల గస్తీ కూడా లేక వీరి ఆగడాలకు అదుపులేకుండా పోతోంటున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నారాయణవనం, మే 10(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవా లను శనివారం అంకురార్పణతో ప్రారంభిం చారు. ఈనెల 19వ తేదీ వరకు బ్రహ్మోత్స వాలను నిర్వహించనున్నట్టు ఆలయాధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. సాయం త్రం గంట నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం స్థానిక భావనారుషి ఆలయం నుండి పద్మ శాలీలు కొడి వస్త్రాన్ని మేళతాళాలతో తీసుకు వచ్చి ఆలయ అర్చకులు అందజేశారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్సంగ్రహణం, పుట్టమ ట్టిని పాలికలో నింపి నవధాన్యాలను మొల కెత్తించే కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశా రు. బ్రహ్మోత్సవాల్లో ఉత్సవర్ల ఊరేగింపు కొన సాగే స్థితిగతుల పర్యవేక్షణకు విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు. వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా ఆల యాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేశారు.

వృద్ధురాలి అదృశ్యం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వృద్ధురాలు అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. తొట్టంబేడు మండలం పెద్దసింగమాలకు చెందిన శ్యామలాదేవి(69) అదృశ్యమైంది. శనివారం శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేశారు.

శనీశ్వరస్వామికి పూజలు

రామచంద్రాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో శనీశ్వరస్వామికి శని త్రయోదశి సందర్భంగా వివిధ పూజలు నిర్వహించారు. భక్తులు తైలాభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వరదయ్యపాళెం, మే 10(ఆంధ్రజ్యోతి): చెల్లిని చూడ్డానికి వెళుతూ ప్రమాదంలో గాయపడిచికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. సత్యవేడు మంవడలం రేపల్లెవా డకు చెందిన ఉదయ్‌కిరణ్(21) శుక్రవారం రాత్రి వరదయ్యపాళెం మండలంలోని నెలటూ రుతాగేలిలో ఉన్న తన సోదరిని చూడడానికి తల్లితో పాటు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. ఆమడదూరంలో సోదరి ఇంటికి చేరే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఉదయ్‌కిరణ్ తీవ్రంగా గాయపడగా బీఎన్‌కండ్రిగ మండలం తలారి వెట్టు పంచాయతీ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనిల్ స్వల్పంగా గాయపడ్డాడు. ఉదయ్ కిరణ్‌ను మెరు గైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తర లించారు. అక్కడ చికి త్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కాగా ఉదయ్‌కిరణ్ తల్లి, మరో క్షతగాత్రుడు అనిల్ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

హనుమంత వాహనంపై చెన్నకేశవుడి రాజసం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): ఊరందూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి శనివారం హనుమంత వాహనంపై విహరించాడు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు.

నకిలీ బంగారం విక్రయ ముఠా కోసం గాలింపు

పుత్తూరు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): అమాయకులను లక్ష్యంగా చేసుకుని నకిలీ బంగారం విక్రయ ముఠా దోపిడీకి పాల్పడుతోంది. ఇటీవల పుత్తూరులో ఓ చిరుదుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకునే దంపతుల నుంచి రూ.4 లక్షలు దోచుకెళ్లారు. సీఐ సురేంద్రనాయుడు తెలిపిన వివరాలు... గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన చెంచయ్యనాయుడు, స్వప్న దంపతులు తమ కుమార్తె షర్మిళతో కలిసి జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో నివాసం ఉంటున్నారు. లక్ష్మి అనే మహిళ దుకాణానికి వచ్చి పోతూ ఆ భార్యాభర్తలతో పరిచయం పెంచుకుంది. తాము ఇంటి నిర్మాణం చేసే సమయంలో బంగారం దొరికిందని ఆ దంపతులకు చెప్పింది. తెలిసిన వారికి మాత్రమే విక్రయిస్తామని నమ్మించింది. తక్కువ ధరకే బంగారం వస్తుందని ఆ దంపతులు ఆశపడ్డారు. వారికి అనుమానం కలగకుండా ముందుగా మేలిమి బంగారాన్ని ఇచ్చి పరిశీలించుకోమని నమ్మబలికింది. వారు ఆ బంగారాన్ని బజారువీధిలో తెలిసిన ఆచారి వద్దకు వెళ్లి పరిశీలించుకున్నారు. బంగారం స్వచ్ఛమైనదని ఆ ఆచారి చెప్పడంతో మిగిలిన బంగారు కొనుగోలుకు ఆ దంపతులు సిద్ధపడ్డారు. ఇంట్లో దాచుకున్న రూ.లక్షతో పాటు తమ వద్ద ఉన్న బంగారాన్ని కుదవ పెట్టి మరో రూ.3 లక్షలు వెచ్చించి బంగారు బిస్కెట్‌ను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన బంగారు ఎవరికీ చూపొద్దని, ఆచారికి చూపితే అనుమానం వస్తుందని, రెండు రోజుల తరువాత పరిశీలించుకోమని లక్ష్మి వారికి సూచించింది. ఆమె చెప్పిన విధంగానే రెండురోజుల తరువాత ఆ బిస్కెట్‌ను తీసుకెళ్లి ఆచారికి చూపగా అది నకిలీ బంగారంగా గుర్తించాడు. అప్పటికే ఆ మహిళ పరారవడంతో తాము మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధితుల సమాచారం మేరకు కాల్ చేయగా గుంటూరు చిరునామా వస్తోందని సీఐ తెలిపారు. వాహన నెంబర్‌ను పరిశీలిస్తే పీలేరు సమీపంలోని సోమల చిరునామా చూపుతోందన్నారు. ఈ సంఘటన గత నెల 29న చోటు చేసుకోగా, బాధితులు ఫిర్యాదు మేరకు ఈనెల 3న కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఓబయ్య పేర్కొన్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు

● ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన ప్రక్రియ
● మొత్తం ఆరు వేల ఖాళీలు చూపే అవకాశం
● త్వరలో బదిలీలు, ఆపై పదోన్నతులు



టీచర్ల వేకెన్సీ గుర్తింపు ప్రక్రియలో ఎంఈవోలు, హెచ్ఎంలు, సాంకేతిక నిపుణులు

చిత్తూరు సెంట్రల్, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన త్వరలోనే పెద్దఎత్తున బదిలీలు, పదోన్నతులు జరగనున్నాయి. ఏ ఒక్క పోస్టూ బ్లాక్ చేయకుండా వీటిని చేపట్టే దిశగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.నాలుగు నెలలుగా సాగుతున్న టీచర్ల సీనియారిటీ జాబితా, ఖాళీల గుర్తింపు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో శనివారం విద్యాశాఖలో క్లియర్ వేకెన్సీలు చూపేందుకు అధికారులు చిత్తూరు ప్రభుత్వ పాఠశాలలో సమావేశమై కసరత్తు జరిపారు. చిత్తూరు డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్, అన్నమయ్య జిల్లా డీవైఈవో లోకేశ్వర రెడ్డి, చిత్తూరు డీవైఈవో ఇందిర, ఏడీ వెంకటేశ్వరరావు ఈ ప్రక్రియను పర్యవేక్షించగా 66మంది ఎంఈవోలు, హెచ్ఎంలు ప్రక్రియలో పాలుపంచుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,918 ఖాళీలుండగా, మరో నాలుగు వేల ఖాళీలు చూపే అవకాశం ఉంది. బదిలీలు,ఆపై పదోన్నతులు, మిగిలిన ఖాళీలకు తాజాగా డీఎస్సీ ద్వారా వచ్చే ఉపాధ్యాయులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. క్లియర్ వేకెన్సీ వివరాల ఆధారంగా తొలుత బదిలీలు చేపడతారు. ఆపై 1:2 విధానంలో పదోన్నతుల జాబితా విడుదల చేయనున్నారు.

● ప్రస్తుత ఖాళీల వివరాలు

యాజమాన్యం	మంజూరైన పోస్టులు	పనిచేస్తున్న టీచర్లు	ఖాళీలు
ప్రభుత్వ	723	598	125
ఎంపీ/జడ్పీ	15,552	13,969	1583
మున్సిపల్ కార్పొరేషన్	589	454	135
మున్సిపాలిటీ	508	433	75
	17,372	15,454	1918

క్యాడర్ వారీగా ఖాళీలు

విద్యాశాఖలో 37 కేడర్లలో టీచర్లు పని చేస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ జరగక ముందే వివిధ క్యాడర్లలో 1981 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు.గ్రేడ్-2 హెచ్ఎం 90 ఖాళీలు, స్కూల్ అసిస్టెంట్(మ్యాథ్స్)- తెలుగు 28, ఉర్దూ 1, తమిళం 1, ఎస్ఏ(ఫిజిక్స్) తెలుగు 25, తమిళం 1, ఎస్ఏ(బయాలజీ) తెలుగు 63, ఉర్దూ 1, తమిళం 3, ఎస్ఏ(సోషల్)తెలుగు 103, ఉర్దూ 5, తమిళం 5, ఎస్ఏ-ఇంగ్లీష్ 96, తెలుగు 53, హిందీ 27, ఉర్దూ 14, సంస్కృతం 3, ల్యాంగ్వేజ్ పండిట్లు-తెలుగు 2, హిందీ 3, ఉర్దూ 1, తమిళం 1, ఎస్ఏ-స్పెషల్ ఎడ్యుకేషన్ 13, ఫిజికల్ ఎడ్యుకేషన్ 93, పీఈటీ 25, క్రాఫ్ట 3, డ్రాయింగ్ 16, మ్యూజిక్ 5, ఒకేషనల్ 16, పీఎస్-హెచ్ఎం తెలుగు 75, ఉర్దూ 1, తమిళం 1, సెకండరీ గ్రేడ్ టీచర్లు-తెలుగు 1039, ఉర్దూ 97, తమిళం 8 ఖాళీలు ఉన్నాయి. వీటితో పాటు ప్రస్తుతం జరుగుతున్న ఖాళీల గుర్తింపు ప్రక్రియ పూర్తయితే మరో నాలుగు వేల ఖాళీలు చూపనున్నారు.

జాతర దొరలు

మొక్కులు చెల్లించుకున్న వేలాదిమంది భక్తులు

చిన్నారులతో సందడిగా ఆలయ ప్రాంగణం




దొర వేషంలో నగరంలో తిరుగుతున్న కైకాల, చాకలి వంశస్తులు, కర్ణాల వీధిలో నడివీధి గంగమ్మకు ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

తిరుపతి(జీవకోన), మే 10(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని శనివారం కైకాల, చాకలి కులస్తులు దొర వేషాన్ని ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేషాన్ని ఇతరులు ఎవరూ వేయరు. దొర వేషాన్ని కైకాల కులస్తులు, మంత్రి వేషాన్ని చాకలి కులస్తులు మాత్రమే వేయడం ఆనవాయితీ. ఈ వేషాధారణతో వారు ఊరంతా తిరిగి పూజలు అందుకున్నారు. చివరిగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. శనివారం వేలాదిమంది భక్తులు అమ్మను దర్శించుకున్నారు. వివిధ వేషధారణలతో, దుత్తలు మోస్తూ ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు వివిధ వేషధారణలో సందడి చేశారు. చంటిబిడ్డలకు సైతం వేషాలు వేసి వారికి అమ్మవారి ఆశీస్సులు అందాలని తల్లిదండ్రులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కర్పూరహారతు లు సమర్పించారు.

విశ్వరూపం ప్రతిమపై ప్రధాన చర్చ

బుధవారం వేకువజామున గంగమ్మతల్లి విశ్వరూప దర్శనం ఉంటుంది. దీనిపై విశ్వబ్రాహ్మణ సంఘంతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, ఆలయ ఈవోలు ప్రధానంగా చర్చించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్దుతామని గాంధీరోడ్డు విశ్వబ్రాహ్మణ సంఘం వారు అధికారులకు తెలియజేశారు. ప్రధానంగా మంగళవారం జాతర మహోత్సవం, విశ్వరూప దర్శనం రోజున చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. విశ్వరూప దర్శనం రోజున ఎవరెవరు ఎక్కడ ఉండాలి.. ఎంతమంది స్టేజీపైన, గ్యాలరీల ఏర్పాటు తదితర వాటిపై ప్రధానంగా చర్చించారు. అమ్మవారిని భక్తులు సంతోషంగా దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ భక్తవత్సలం, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ తులసీ కుమార్, ఆర్వో సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు. అదేవిధంగా ఉదయం నిర్వహించిన సారె ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళి, మహేష్ యాదవ్, ఆముదాల తులసీ, సుబ్బు యాదవ్, బ్యాంకు శాంతమ్మ, జనసేన నాయకులు ఎం.నరసింహులు నాయుడు, రాజారెడ్డి, సుభాషిణి, కీర్తన, వినోద్ రాయల్, కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్ర, అన్నా అనిత, రేవతి, కల్పన, పొన్నాల చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు.





మొక్కులు తీర్చుకున్న భక్తులు - సారె ఊరేగింపులో నృత్యం చేస్తున్న ఆరణి మదన్, శివ

వెరిటాస్‌కు రక్షణ శాఖ అనుమతి



తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు సైనిక్ స్కూల్ సొసైటీ, భారత ప్రభుత్వ రక్షణ శాఖ నుంచి అప్రూవల్ వచ్చిందని సంస్థ ఛైర్మన్ శేషారెడ్డి వెల్లడించారు. శని వారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్‌తో స్పెషల్ ఎన్‌డీయేను ప్రారంభిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు శ్రీకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మీడియం కొనసాగించాలి

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజి

తిరుపతి(విద్య), మే 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గత వైసీపీ విధానాలు వీడాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని ఆపస్ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాలల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు అంశాలపై స్థానిక బైరాగిపట్టిడలోని ఆపస్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు అవగాహనా కార్యక్రమం శనివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం ఇంగ్లిష్ మీడియం మాత్రమే ఉండేలా కూటమి ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండో సెక్షన్ ఇవ్వాలని, ఆ తరువాత ప్రతి 30 మందికీ అదనపు సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. 20 మంది విద్యార్థులకు ఓ ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సహాధ్యక్షులు చక్రపాణి మాట్లాడుతూ కో ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించి పీజీటీ పోస్టులను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దివాకర్, కార్యవర్గ సభ్యులు సుభాష్‌చంద్రదాస్, జిల్లా గౌరవాధ్యక్షులు ప్రసాద్‌రాజు, ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి, కోశాధికారి పట్టాభి, సహాధ్యక్షులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మంగళం-శెట్టిపల్లి మార్గంలో కల్వర్టుల నిర్మాణం



కల్వర్టు వద్ద జరుగుతున్న పనులు

తిరుపతి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): మంగళం-శెట్టిపల్లి మార్గంలో కల్వర్టుల నిర్మాణ పనులు మొదలయ్యాయి. విజిలెన్స్ విచారణతో ఆ మార్గంలో జరుగుతున్న పనులు అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. నెలలు గడవడంతో గుంతలు, కంకరతేలి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఎండలో దుమ్ము, వానల్లో బురద వంటి సమస్యలతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగం వర్షాకాలం దృష్ట్యా ముందుగానే కల్వర్టు పనులు పూర్తి చేయాలని భావించింది. దీంతో మూడు రోజులుగా పనులు పునఃప్రారంభించారు. ఈ పనులు పూర్తయిన తర్వాత రోడ్డు పనులు ప్రారంభించనున్నారు.

ఐదు పంచాయతీలకు నేడు టీడీపీ కమిటీల ఏర్పాటు?

తిరుపతి అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాలైన సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళంక్వార్టర్స్, తిరుమలనగర్, శెట్టిపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో టీడీపీ నూతన కమిటీల ఏర్పాటుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఇదివరకు ఉన్న ఉమ్మడి పంచాయతీల పదవులను రద్దుపరిచి తాజా కమిటీలు ఏర్పాటుచేయాలని భావించారు. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీకి అధ్యక్ష కార్యదర్శులను, సభ్యులను ఎన్నుకోనున్నారు. ఆయా పంచాయతీ పరిధిలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కోసం శ్రమించినవారితో ఆదివారం సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది. ఇందులో కమిటీలను ఎన్నుకోనున్నారని సమాచారం.

సీబీఎస్‌లో కొంతభాగం కూల్చివేతకు గ్రీన్‌సిగ్నల్

తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు



సీబీఎస్‌లో కూల్చనున్న భాగం

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్ మోడల్ బస్సుస్టేషన్ నిర్మాణం ఆలస్యమవుతోంది. అదేసమయంలో సీబీఎస్‌లో ప్లాట్‌ఫామ్స్ పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ క్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ ప్రాథమిక చర్యలు చేపట్టింది. సెంట్రల్ బస్సుస్టేషన్ కొంత భాగం కూల్చివేతకు విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఆ స్థానంలో తాత్కాలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసి సేవలు అందించనుంది. తొలివిడతగా 6ప్లాట్‌ఫామ్స్‌ను పిల్లర్ల మినహా కూల్చనున్నారు. ఇందుకు దాదాపు రూ.18లక్షలు కేటాయించింది. దానిస్థానంలో తాత్కాలికంగా అధునాతన రేకుల షెడ్డును నిర్మించనున్నారు. ఈ షెడ్డుకోసం రూ.45లక్షలు కేటాయించింది. ఈ నెలాఖరులో టెండర్లు ఖరారై జూన్ మొదటివారంలో కూల్చే పనులు మొదలుపెట్టనున్నారు. ఆ తరువాత పిల్లర్ల సాయంతో రేకులషెడ్డు నిర్మించి యథావిధిగా ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటుచేయనున్నారు. రెండో విడతగా మిగిలిన ప్లాట్‌ఫామ్స్‌పై దృష్టిపెట్టనున్నారు.

ఆరు ప్లాట్‌ఫామ్స్ కూల్చివేత

చెన్నై పాయింట్ నుంచి పుత్తూరు ప్లాట్‌ఫామ్ వరకు, ఆరు దుకాణాలు, పోలీస్ అవుట్ పోస్టు, బస్సు టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్, ఏటీఎం కార్యాలయం, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ఆర్టీసీలకు సంబంధించి విచారణ కార్యాలయాలు, కార్గో సెంటర్, ఓ హోటల్, మరుగుదొడ్ల స్థలాల కట్టడాలను పూర్తిస్థాయిలో తొలగించనున్నారు. ఈ కేంద్రాలను ఎదురుగా ఉన్న శ్రీనివాసం బస్టాండులోకి మార్చనున్నారు. కార్గో కేంద్రాన్ని ఏడుకొండల బస్టాండు వద్ద టీటీడీ నిర్మించిన శ్రీవారి దర్శన టోకెన్ల జారీ కేంద్రంలోకి తరలించనున్నారు.

ప్లాట్‌ఫామ్స్ కొరత తీరేనా..?




బస్టాండు బయట ఆగివున్న తిరుచానూరు బస్సు - పల్లెవెలుగు బస్టాండుకు ఎదురుగా ఆగిన తిరుమల బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మే 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో ప్లాట్‌ఫామ్స్ సరిపోక అటు సిబ్బంది, ఇటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నా అధికారులు మాత్రం దీని పరిష్కారంపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. 11 ఎకరాల్లో విస్తరించిన సెంట్రల్ బస్టాండులో 63 ప్లాట్‌ఫామ్స్ ఉన్నాయి. ఇందులో ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రధాన నగరాలు, ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి వేర్వేరుగా ఉన్నాయి. అయితే మంగళం డిపో ద్వారా నడిచే పల్లెవెలుగు బస్సులకు(తిరుచానూరు), తిరుమలకు తిరిగే పుత్తూరు, సత్యవేడు, శ్రీకాళహస్తి, చిత్తూరు, కుప్పం డిపో బస్సులకు ప్రత్యేకంగా ప్లాట్‌ఫామ్స్ లేవు. ప్రత్యామ్నాయంగా ఏడుకొండల బస్టాండులో ఆపుకోవాలని అధికారులు ప్రతి సమావేశంలో ఆదేశిస్తున్నా డ్రైవర్లు లెక్కచేయడం లేదు. బస్టాండు ఆవరణలో ఎక్కడపడితే అక్కడ ఆపుతూ ట్రాఫిక్ అంతరాయాన్ని సృష్టిస్తున్నారు. ప్రయాణికులను తికమకపెడుతున్నారు. కంట్రోలర్స్ దీని గురించి పట్టించుకోవడం లేదు. కొత్తగా నియమితులైన ప్రజారవాణాధికారి వెంకటరావు ఈ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జనావాసంలో బీరుబాటిళ్ల శుభ్రత కేంద్రం

రహదారిపై బీరు బాటిళ్ల బస్తాలు ● వాహనదారుల అవస్థలు



బీరు బాటిళ్ల నిల్వ కేంద్రం



రోడ్డుకు ఇరువైపులా పేర్చిన బీరుబాటిళ్ల మూటలు

తిరుపతి అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని వెంకటేశ్వరకాలనీలో రోడ్డుపై బీరు బాటిళ్ల బస్తాలు పేర్చేశారు. ఫలితంగా రోడ్డు ఇరుకైపోయింది. ఆ దారిలో వెళ్లే వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు ప్రాంతమైన వెంకటేశ్వరకాలనీ నుంచి గెజిటెడ్ కాలనీకి వెళ్లే మార్గమధ్యంలో కొన్ని నెలల క్రితం మద్యం సీసాల (బీరు బాటిళ్ల) శుభ్రం చేసే కేంద్రం ఏర్పాటు చేశారు. నగర వ్యాప్తంగా పోగైన రోజువారి బీరుబాటిళ్లను ఈ కేంద్రానికి తరలిస్తారు. ప్రత్యేక యంత్రం ద్వారా శుభ్రం చేసి మళ్లీ బీరు తయారీ ఫ్యాక్టరీకి విక్రయిస్తారు. వేసవి కావడంతో రెండు నెలలుగా బీరు బాటిళ్లు పెద్ద సంఖ్యలో ఈ కేంద్రానికి చేరుతున్నాయి. కేంద్రానికి సంబంధించిన ఆవరణంలో నిల్వ చేయడానికి స్థలాభావం ఏర్పడింది. దీంతో నిర్వాహకులు దారిలో ఇరువైపులా మూటలను పేర్చేశారు. గెజిటెడ్‌కాలనీ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతు న్నారు. అలాగే సీసా ముక్కలతో వాహనాలు పంక్చర్ అవుతున్నాయి. ఇళ్ల మధ్య మద్యం బాటిళ్లను శుభ్రపరిచే కేంద్రానికి అనుమతులు ఎవరు ఇచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బీరు బాటిళ్లను తొలగించాలని కోరుతున్నారు.

మాతృత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): మాతృత్వ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని మాతృదేవోభవ సత్సంగ్- సంఘమిత్ర అసోసియేషన్ అధ్యక్షురాలు అమరావతి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యురాలు లక్ష్మీ దేవి జ్ఞాపకార్థం ఎయిర్ బైపాస్‌రోడ్డులోని యూత్ హాస్టల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

వీరుడా వందనం



రొంపిచెర్లలో మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

రొంపిచెర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి): పాక్ కాల్పుల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీ నాయక్‌కు రొంపిచెర్లలో గ్రామస్తులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మా లలు వేసి, మౌనం పాటించారు. చిన్న వయస్సులోనే దేశంకోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ అమర్ రహే అంటూ వారు నినాదాలు చేశారు.

మద్యం అనుకుని పెట్రోల్ తాగాడు

పుంగనూరు రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మద్యం అనుకుని పెట్రోల్ తాగిన సంఘటన శనివారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలు... పట్టణంలోని ఎన్ఎస్‌పేటలోని రాంనగర్‌కు చెందిన వాసుదేవాచారి (46) మద్యం మత్తులో ఇంటిలో ఉన్న పెట్రోల్‌ను మద్యం అనుకుని తాగి స్పృహ కోల్పోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

డైట్‌కు 17 మంది అధ్యాపకులు

వెదురుకుప్పం, మే 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌కు 17 మంది అధ్యాపకులు వచ్చారని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు డైట్‌లో వారు ఈ ఏడాది అధ్యాపకులుగా కొనసాగుతారని చెప్పారు. అధ్యాపకుల కొరత లేకుండా డైట్ నిర్వహణ కొనసాగుతోందన్నారు.



కోట మండల సరిహద్దులో మత్స్యకారులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్ఐ శివసౌమ్య, ఏఎస్ఐ రాధ

సముద్రతీరంలో నిఘా పెంపు

● 18 తీర ప్రాంత గ్రామాల్లో అప్రమత్తం


కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో సముద్రతీర గ్రామాలు అప్రమత్తమయ్యాయి. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా పెంచారు. కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని 18 గ్రామాల్లో కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు మెరైన్ ఎస్ఐ శివసౌమ్య తెలిపారు. బయట వ్యక్తుల సంచారం, సముద్రంలోకి అపరిచిత పడవలు, స్టీమర్ల రాకను గుర్తిస్తే వెంటనే 9392914744 నంబర్‌కు, అదేవిధంగా టోల్‌ఫ్రీ నంబర్ 1093కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

భారత ఆర్మీకి చిన్నారుల ఆర్థికసాయం



తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): భారత ఆర్మీకి చిన్నారులు శనివారం ఆర్థికసాయం చేశారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో తమ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకోవడం ఇష్టం లేక తిరుపతికి చెందిన అనిరుధ్ శ్రీరామ్, సుచిత్ర శ్రీఅనన్య, ఆశ్రిత్ శ్రీరామ్ అనే ముగ్గురు చిన్నారులు తమ పుట్టిన రోజుకు అయ్యే ఖర్చును భారత ఆర్మీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు తమ తల్లిదండ్రులతో కలిసి శనివారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగదు అందజేశారు. దానిని భారత ఆర్మీకి పంపేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.45 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,635









గంగరంగ వైభవం



అమ్మవారిని దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే ఆరణి



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర శనివారం కోలాహలంగా సాగింది. దొరవేషంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుమల వెంకన్న సారె ఊరేగింపులో భాగంగా పలువురు భక్తులు వివిధ రకాల వేషాలతో నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఊరేగింపు భక్తజన ప్రవాహంగా సాగింది.



సారె తీసుకొస్తున్న శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి- బహూకరించిన వజ్రపు తిలకం







సారె ఊరేగింపులో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు మదన్





నేటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు తరలివెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సెంట్రల్ బస్టాండులో ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి పది నిమిషాలకూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అమరావతి, ఇంద్రా ఏసీ, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలెక్స్ బస్సులను కేటాయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు కోరారు.

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు



తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు శనివారం ఉదయం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీఆర్ నాయుడు హెల్మెట్లు పంపిణీ చేశారు. విరాళంగా అందిన రూ.5 లక్షల విలువైన 555 హెల్మెట్లు మొదటి విడతగా ఉద్యోగులకు అందజేశారు. ఉద్యోగులకు హెల్మెట్లు విరాళంగా అందజేసేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎస్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకు వచ్చారన్నారు. వీరు మరో ఐదు వేల హెల్మెట్లు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు శాంతారామ్, వీజీవోలు రామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో శ్రీముఖి



శ్రీముఖి



వడ్డేపల్లి రామచందర్

తిరుమల, మే 10 (ఆంధ్రజ్యోతి): సినీ నటి శ్రీముఖి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి మార్గంలో శుక్రవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న ఆమె శనివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, గాలి భానుప్రకాష్, ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు తిరుమలలోని శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద ఎస్సీ కమిషన్ సభ్యుడు రామచందర్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్వాగతం పలికారు.

పెద్దపరియలో ఆగిపోయిన నెల్లూరు-చెన్నై మెమో

● సాంకేతిక కారణాలతో గంటపాటు నిలిపివేత

ఓజిలి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపరియ రైల్వేస్టేషన్‌లో నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న మెమో రైలు కొంతసేపు నిలిచిపోయింది. సాయంత్రం 5.20గంటలకు పెద్దపరియకు చేరుకున్న రైలు సాంకేతిక కారణాలతో గంటపాటు స్టేషన్‌లోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు కొంతమేర ఇబ్బందిపడ్డారు. 6.20గంటలకు పెద్దపరియ నుంచి బయలుదేరి వెళ్లింది.

అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



ఆకట్టుకుంటున్న వసంతోత్సవ సెట్టింగ్

తిరుచానూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఫ్రైడేగార్డెన్‌కు తీసుకెళ్లి పుట్టమన్ను సేకరించారు. రక్షాబంధనం, సేనాపతి ఉత్సవం తర్వాత అంకురార్పణ చేశారు. ఆదివారం నుంచి ఫ్రైడేగార్డెన్‌లో మూడు రోజులూ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. అంకురార్పణ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఆకర్షణీయంగా సెట్టింగ్‌ను రూపొందించారు. ఏటా అమ్మవారి ఉద్యానవనంలో పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం మూడు రోజులపాటు ఈ వేడుకలు జరుపుతారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. వసంతోత్సవాల మండపాన్ని నందనవనంగా అలంకరించారు. వివిధ రకాల జంతువులు, పక్షులు నిజంగానే ఉన్నాయా అనేంతగా టీటీడీ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది తీర్చిదిద్దారు. వన్యప్రాణుల అరుపులు వినిపించేలా సౌండ్ సిస్టమ్ అమర్చారు. పుష్పాలంకరణను విశేషంగా ఆకట్టుకుంటోంది.




ప్రకృతి రమణీయతతో ఫ్రైడే గార్డెన్‌లో భారీ సెట్టింగ్ - పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

జీతాలు చెల్లించలేదని ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల సమ్మె

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమల మధ్య నడిచే ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు శనివారం ఉదయం సమ్మెకు దిగారు. ఏప్రిల్ నెల వేతనాలు జమ చేయకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఉదయం 6.30గంటలకు డ్యూటీ ఎక్కే 30మంది డ్రైవర్లు విధులను బహిష్కరించారు. జీతాలు చెల్లిస్తేనే బస్సులు నడుపుతామని భీష్మించారు. సమాచారం అందుకున్న అధికారులు విశ్వనాథం, బాలాజీ, హరిబాబు అక్కడికి చేరుకుని డ్రైవర్లతో చర్చించారు. రెండో శనివారం, ఆదివారం సెలవులు కావడంతో రెండు రోజులు ఓపిక పట్టాలని డ్రైవర్లకు నచ్చజెప్పారు. విధులకు వెళ్లాలని కోరారు. అప్పటికే 9.30 గంటలైంది. దాదాపు 3గంటల పాటు ఎలక్ట్రిక్ బస్సులు ఘాట్‌లో రాకపోకలు ఆగిపోయాయి. వారాంతం, సెలవురోజులు కావడంతో విష్ణునివాసంలో ఉదయం బస్సుల కొరత నెలకొంది. 10గంటల నుంచి ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సకాలంలో జీతాలు జమకాని పక్షంలో సమస్యను తమ దృష్టి తీసుకురావాలని, అలాకాకుండా బస్సులను ఆపేయడం సబబుకాదని డ్రైవర్లకు సూచించారు. అలాగే సకాలంలో జీతాలు చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు.



భక్తజన సంద్రం.. ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు, వేసవి సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

మానవత్వాన్ని తట్టిలేపే ఆత్రేయ సాహిత్యం




మాట్లాడుతున్న ఆచార్య విస్తాలి శంకరరావు

శ్రీసిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): మానవత్వాన్ని తట్టిలేపే సాహిత్యం ఆత్రేయ సొంతమని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. శ్రీసిటీలో ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 'ఆత్రేయ గీతామృతం' కార్యక్రమం ఆకట్టుకుంది. శంకరరావు వక్తగా విచ్చేసి ఆత్రేయ సినీ గీతాల్లో అర్థవంతమైన సాహిత్యం, మాధుర్యాన్ని వివరించారు. సినీ సాహిత్యంలో ఆచార్య ఆత్రేయ ఓ మైలురాయి అని పేర్కొన్నారు. మనసుకు హత్తుకునే గీతాలతో మనసు కవిగా ఆయన పేరుపొందారని తెలిపారు. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా చెప్పలేని విధంగా మనసు గురించి ఎంతో విశ్లేషణాత్మకంగా తన సాహిత్యం ద్వారా చెప్పారన్నారు. 1951లో వచ్చిన దీక్ష సినిమా ద్వారా తన సినీ గేయ రచనను మొదలు పెట్టి నాలుగు దశాబ్దాల పాటు మనసు, అనుబంధాలు, ప్రేమ, విరహం, స్నేహం, భక్తి తదితర రెండువేలకు పైగా పాటలు రాసిన ఘనత ఆత్రేయది అన్నారు. కార్యక్రమానికి శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చెన్నై వేదవిజ్ఞాన వేదిక సంస్థ కార్యదర్శి కందనూరు మధు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

9 మంది అంతర్రాష్ట్ర ఆవుల దొంగలు అరెస్టు

● నాలుగు ఆవులు, వాహనం స్వాధీనం



ఆవుల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ఆవుల దొంగలను అరెస్టు చేసినట్టు గాజులమండ్యం సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలోని హైవేపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి రేణిగుంట - పుత్తూరు ప్రధాన రోడ్డు మార్గంలోని ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న సమయంలో పికప్ వ్యాన్‌లో ఆవులను రవాణా చేస్తూ కనిపించడంతో, పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారు బిహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ రఫీ, జేకంఖాన్, మహమ్మద్ ఇమ్రాన్, ఇస్రాయిల్, తహీర్, రఫీక్ అహ్మద్, జుబేర్, హనీ హనీస్ అని తేలింది. వారు తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోటకు చెందిన కేబుల్ బాషాతో ముఠాగా ఏర్పడి రేణిగుంట, వడమాలపేట, నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లో ఆవులను దొంగతనం చేసి వాటిని కబేళాలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నాలుగు ఆవులు, పికప్ వ్యాన్, బైక్ స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు


స్వామి, అమ్మవార్ల తిరుచ్చి ఉత్సవం

చిల్లకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. సుప్రభాత సేవ, తిరుచ్చి ఉత్సవం విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంతసేవ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శంకయ్య, హైమావతి, పెరికల గోపాలయ్య, సుబ్బమ్మ, సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, జనార్దనరెడ్డి, రోహిణి దంపతులు ఉభయదాతలుగా మూగ వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ, బూత్ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయండి

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ, బూత్ కమిటీల నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గూడూరు మండల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపునిచ్చేలా కమిటీల్లో నియామకాలు చేపట్టాలన్నారు. సిమెంటు రోడ్లు లేని పంచాయతీలకు సంబంధించి ప్రణాళికలను రూపొందిస్తే ఉపాధి నిధులతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్‌శాఖ ద్వారా మంజూరైన ఎఫ్‌డీఆర్ పనులను ఆయా సాగునీటి సంఘాల అధ్యక్షుల పర్యవేక్షణలో జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, సురేంద్ర, నరసరాజు, పుట్టి వెంకటేశ్వర్లు నాయుడు, పెంచలయ్య, పిట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సముద్రతీర ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


మత్స్యకారులతో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, మే 10 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై దుగరాజపట్నంలోని మత్స్యకారులకు డీఎస్పీ గీతాకుమారి శనివారం అవగాహన కల్పించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిందన్నారు. ఈ క్రమంలో విద్వేష పూరితమైన సమాచారాన్ని, తప్పుడు వార్తలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం నేరమన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మత్స్యకారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా


మహేష్ కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న కురుగొండ్ల

బాలాయపల్లి, మే 10(ఆంధ్రజ్యోతి) టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ సభ్యత్వం భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గోళ్ల మహేష్ ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఊట్లపల్లిలో గోళ్ల మహేష్ కుటాంబాన్ని పరామర్శించారు. రూ.ఐదు లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, గోళ్ల మధు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, సీసీ నాయుడు, కల్యాణ్ రెడ్డి, దాసరి కోటేశ్వరావు, మద్దూరు కృష్ణ, మారెళ్ల వెంకటాద్రి, పులకంటి మురళి, వయ్యావూరు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వెంకటగిరి, మే10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేటలో ఇటీవల గ్యాస్ సిలిండ్ పేలిన ప్రమాదంలో మృతి చెందిన అనుసూయమ్మ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరామర్శించారు. అనుసూయమ్మ టీడీపీ సభ్యతం కలిగి ఉండడంతో రూ.5లక్షల బీమా చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'

వెంకటగిరి టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కుమ్మరిగుంట, అమ్మవారిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సీడీపీవో షంషాద్‌బేగం ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజారాణి, లక్ష్మీకాంతమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల పరిధిలోని కమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో షంషాద్ బేగం, ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, ఎంఈవో జగదీష్‌బాబు, ఐసీడీస్ అధికారిణి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న అంగన్‌వాడీ విద్యార్థులు

సముద్ర జలాలతో గ్రామోత్సవం


సముద్ర జలాలున్న గంగపెట్టెతో గ్రామోత్సం నిర్వహిస్తున్న వెంకన్నపాళెం గ్రామస్తులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామదేవత గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శనివారం సముద్ర జలాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గంగపెట్టె, సముద్ర కుంభ జలం, పూలబుట్టలతో పుష్పయాగం కోసం మేళతాళాల మధ్య గ్రామోత్సవం జరిపారు. ఆలయం వద్ద అమ్మవారి ముగ్గు వేసి పండరి భజన, కోలాట బృందం నృత్యాలు చేసింది. అమ్మవారి ఆలయం నుంచి గ్రామ పొలిమేరల వరకు మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

తీరప్రాంత గ్రామాల మహిళలకు
గగనంగా మారిన గర్భకోశ వైద్య సేవలు

30 పడకల ఆస్పత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీ


కోట ప్రభుత్వాస్పత్రి

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): సముద్రతీర ప్రాంత గ్రామాల మహిళలకు గర్భకోశ సమస్యలకు వైద్యం గగనంగా మారింది. నాలుగు మండలాల్లోని సర్కారు దవాఖానాల్లో గర్భకోశ వ్యాధి నిపుణులు లేకపోవడంతో మహిళలు దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. సముద్రతీర ప్రాంత మండలమైన కోట పట్టణంలో 30 పడకల ప్రభుత్వాస్పత్రి ఉంది. చిల్లకూరు మండలంలోని వల్లిపేడు, కోట మండలంలోని చిట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఈ ఆస్పత్రి పరిధిలోకి వస్తాయి. అలాగే చిట్టమూరు, వాకాడు మండలాల్లోని సముద్రతీర ప్రాంతాల మహిళలు ఎక్కువగా గర్భకోశ వ్యాధుల వైద్యం కోసం కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రికి వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ కొన్ని నెలల పాటు దీర్ఘకాలిక సెలవులో ఉంటూ ఇటీవలే ఉద్యోగానికి రాజీనామా చేశారు. అలాగే ఈ ఆస్పత్రిలో జనరల్ సర్జన్, ఎన్‌సీడీ డాక్టర్లు లేరు. పక్కనే ఉన్న వాకాడు ప్రభుత్వాస్పత్రి గైనకాలజిస్ట్ మెడికల్ లీవ్‌లో ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గర్భిణులు, బాలింతలు గర్భకోశ వ్యాధులకు సంబంధించి అత్యవసర సేవలు పొందాలంటే నాయుడుపేట, గూడూరు పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. మెరుగైన వైద్యం అవసరమైతే నెల్లూరులోని కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. ఆర్థిక స్థోమతలేని వారి పరిస్థితి దయనీయంగా మారింది. కోట మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, శ్రీనివాససత్రం, గోవిందపల్లి, గోవిందపల్లిపాలెం, సిద్దవరం, వావిళ్ల దొరువు, గున్నంపడియ, యమదిన్నెపాళెం, సిద్దవరం, కర్లపూడి, ఉత్తమనెల్లూరు, దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాలకు చెందిన గర్భిణులకు గైనకాలజీ సేవల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజీ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

అమర జవాన్ మురళీ నాయక్‌కు ఘన నివాళి



గూడూరులో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు - వెంకటగిరిలో సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

గూడూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్ బలగాలతో పోరాడుతూ కశ్మీర్‌లో వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామానికి చెందిన మురళీ నాయక్ గురువారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో ఎల్‌వోసీ వద్ద పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో మృతి చెందడం బాధకరమన్నారు. గూడూరు నియోజకవర్గం టీడీపీ తరపున మురళీ నాయక్ కుటుంబానికి రూ.రెండు లక్షలు అందజేస్తామని సునీల్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పిట్టి నాగరాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


సూళ్లూరుపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పట్టణవాసులు

వెంకటగిరి: కశ్మీర్‌లో పాకిస్థాన్ బలగాలతో పోరాడుతూ వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, నాయకులు దొంతు శారద, పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, దొంతు బాలకృష్ణ, పునుగోటి విశ్వనాథ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, శివారెడ్డి, గొల్లగుంట వెంకటముని, మంకు ఆనంద్, తోటా రామచంద్రయ్య, నాగరాజు, చెంగారాజు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పాక్‌తో పోరాడుతూ అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు స్థానికులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వీర జవాన్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతుబజారు సమీపంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను, ఉపకార వేతనాలను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారికి శనివారం శ్రీచక్ర వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ మాట్లాడుతూ అమ్మవారి శ్రీచక్రాన్ని స్థాపించి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కలశస్థాపన, మహామృత్యుంజయ అమృత పాశుపత మహారుద్రాభిషేక సహిత హోమపూజలను శాస్త్రోపేతంగా నిర్వహించామన్నారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శత్రుసంహార త్రిశతి హోమ పూజలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


జీవామృతం కలుపుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. 16రకాల విత్తనాలతో ఏటీఎం సాగుపై అవగాహన కల్పించారు. ఫిల్లరైజేషన్ చేసి విత్తనాలు చల్లడం వల్ల కలిగే ఉపయోగాలు, భూమిలో తేమ లేకపోయినా విత్తనం చెడిపోకుండా ఉండి వర్షం పడిన వెంటనే మొలకెత్తే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ శ్రీనివాసులు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు పద్మ, శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

బస్టాండులో మందుబాబు హల్‌చల్

సూళ్లూరుపేట, మే 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండులో శనివారం రాత్రి ఓ తాగుబోతు హల్‌చల్ చేశాడు. మద్యం మత్తులో బస్టాండు ఆవరణలో రోడ్డుపై అడ్డంగా పడుకోవడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కంట్రోల్ పాయింట్ సిబ్బంది మందుబాబును పక్కకు పంపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

జిల్లా మహాజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీనామా

నాయుడుపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహాజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరరాఘవులు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యక్తిగత సమస్యల కారణంగా తాను పదవి నుంచి తప్పుకుంటున్నానని, రాజీనామా పత్రాన్ని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి పంపినట్లు తెలిపారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయవాడలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ కొలుపులో భాగంగా శనివారం అమ్మవారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయం వద్ద గౌరమ్మ ముగ్గు వేశారు. భక్తులకు గొల్లభామ వినిపించారు. రాత్రి గౌరమ్మ కల్యాణం నిర్వహించారు.

పాముకాటుతో యాచకురాలి మృతి

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి సంగమేశ్వరాలయంలో నిద్రిస్తున్న యాచకురాలిని శనివారం తెల్లవారుజామున పాము కాటు వేయడంతో మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... సుమారు 45 ఏళ్ల మూగ మహిళ గత వారం రోజులుగా కోట, విద్యానగర్‌లో తిరుగుతూ భిక్షాటన చేస్తుండేది. పొద్దు పోయాక సహచర యాచకులతో కలిసి గూడలి సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆరుబయట నిద్రించింది. తెల్లవారుజామున పాము కాటు వేయడంతో కేకలు వేసింది. సహచక యాచకులు లేచి పామును తరిమేశారు. 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా యాచరాలు మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించారు. ఆమెకు సంబంధించిన వ్యక్తులు ఎవరూ రాకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న హరిప్రసాద్(28) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 5వ తేదీ కుటుంబ కలహాలతో హరిప్రసాద్ ఉరివేసుకొని ఆత్మహ్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాయుడుపేట మండలం మేనకూరులోని మేడిన్ సీఎండీ కంపెనీ శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఎలక్ట్రికల్ విభాగం నుంచి ఆరుగురు, మెకానికల్ విభాగం నుంచి ఒక విద్యార్థి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి వార్షిక వేతనం రూ.3.6లక్షలు ఉంటుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషంధర్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం సప్లమెంటరీ పరీక్షల ప్రశ్నపత్రాలు శనివారం కోట పోలీస్‌స్టేషన్‌కు చేరారు. కోటలోని అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రశ్న పత్రాలను అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.

సేవాగుణాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని పెంపొందించుకుని, పేదలకు తమవంతు సాయం అందించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మించిన గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఎంతోమంది వృద్ధులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. వారు ఉండేందుకు ఒక గదిని నిర్మించాలని ప్రగతి సేవాసంస్థ సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో తగిన వసతులో కూడిన గదిని నిర్మించిడం జరిగిందన్నారు. అనంతరం వృద్ధాశ్రమానికి ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. సురేష్‌రెడ్డి దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు.

పుత్తూరు వార్తలు

ట్రాఫిక్‌కు అంతరాయం.. అయినా నిర్మాణం!



పుత్తూరు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రోడ్ల విస్తరణకు నోచుకోలేదు. ట్రాఫిక్ సమస్యలను పరిష్కారం చూపాల్సిన పోలీసు శాఖ కూడా ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తోంది. అంబేడ్కర్ కూడలిలో రెండు నెలల క్రితం ఆర్టీసీ బస్టాండ్ వెళ్లే మలుపులో ట్రాఫిక్ సిబ్బంది కోసం ఏర్పాటైన ఐల్యాండ్‌ను రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ ఢీ కొంది. దీంతో రాకపోకలకు అడ్డుగా ఉందని భావించిన పోలీసులు, మున్సిపల్ అధికారులు ఆ స్థానంలో నిర్మాణాలు చేపట్టకూడదని నిర్ణయించారు. అయితే ఇటీవల తిరిగి ట్రాఫిక్ ఐల్యాండ్ నిర్మాణానికి అవసరమైన పునాదులు వేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధికే సబ్సిడీ రుణాలు


తిరుపతిలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట,మే 10(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీ రుణాలు అందిస్తున్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. శనివారం తిరుపతిలోని ఆయన నివాసంలో మండలంలోని దళిత మహిళలకు చెక్కులను అందజేశారు. వడమాలకు చెందిన కావ్య, ఎనమలపాళెంకు చెందిన సత్య, అప్పలాయగుంటకు చెందిన గుణకు రూ.లక్ష చొప్పున ప్రధానమంత్రి అజయ్ పథక చెక్కులను అందజేశారు. ఇందులో లబ్ధిదారుల వాటా రూ. 10 వేలని, పథకంలో రూ.50 రాయితీ అని, మిగిలిన రూ.40 వేలు వడ్డీ లేదని రుణమని ఎసీఎం మునికృష్ణారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు శివ, చైతన్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట,మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవలను వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయనాంచరులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మేళాతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సదాశివాలయ ఉత్సవాలు

పుత్తూరు టౌన్, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి సమేత సదాశివేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సావాలు శనివారం ధ్వజారోహణంతో పరిసామాప్తమైనట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఆలయ ప్రాకారంలో తీర్థవారి నిర్వహించి, మూలవర్లకు కలశాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలను పరిసమాప్తం చేశారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంతసేవ జరిగింది.

- శనివారం శని త్రయోదశి సందర్భంగా ఆలయంలో ప్రదోష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సదాశివేశ్వర స్వామికి ఎదురుగా ఉన్న నంది మండపంలోని నందీశ్వరుడికి ఆలయ పంచామృతాలు, పరిమళాలు వెదజల్లే సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అశేష భక్తుల నడుమ నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు?

పుత్తూరు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న జయంతిని అకారణంగా తొలగించారని మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఈ.మధుబాబు ఆరోపించారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో పురపాలక సంఘ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమావేశం జరిగింది. విధుల్లో ఏదైనా తప్పు చేసి ఉంటే మానవతా దృక్పథంతో జయంతి క్షమించాలని మేడే రోజున కమిషనర్‌ను కోరామన్నారు. ఇప్పటికైనా కమిషనర్ చొరవ తీసుకుని ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉదయం కైలాసనాథకోనలో త్రిశూల స్నానం నిర్వహించారు. తిరుచ్చి వాహనంపై మరగదవల్లీ, అగస్త్యేశ్వరస్వామి ఉత్సవర్లు, త్రిశూలాన్ని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా కైలాసకోనకు వేంచేశారు. అక్కడ తిరుమంజనం అనంతరం కోన జలపాతంలో త్రిశూల స్నానం చేయించారు. సాయంత్రం ఆలయంలో ధ్వజస్తంభం నుంచి నందీశ్వరుడి చిత్రపటాన్ని అర్చకులు అవరోహణం చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, అర్జితం అధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు.


ధ్వజావరోహణం నిర్వహిస్తున్న అర్చకులు

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠచేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అభిషేకం అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. శనిత్రయోదశి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



హనుమంత వాహనంపై చెన్నకేశవుడి రాజసం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి శనివారం హనుమంత వాహనంపై గ్రామంలో విహరించాడు. చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మొదట స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి ధూప, దీపనైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల నడుమ స్వామి అమ్మవార్లు హనుమంతవాహనంపై గ్రామంలో ఊరేగారు.



శాస్త్రోక్తంగా గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ఠాపన



వరదయ్యపాళెం, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పాక్షిక కుంభాభిషేకం జరిగింది. శ్రీనివాసుడి వాహనమైన గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ఠ, బలిపీఠ స్థాపన కార్యక్రమాలను వేదపండితులు మధుసూదనశర్మ, మోహనాచార్యులు, నిరంజనాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వేలా సుందరం, చిన్న, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నిర్మల్, ఉప సర్పంచ్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

చెల్లిని చూడ్డానికి వెళుతూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వరదయ్యపాళెం, మే 10(ఆంధ్రజ్యోతి): చెల్లిని చూడ్డానికి వెళుతూ ప్రమాదంలో గాయపడిచికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. సత్యవేడు మండలం రేపల్లెవాడకు చెందిన ఉదయ్‌కిరణ్(21) శుక్రవారం రాత్రి వరదయ్యపాళెం మండలంలోని నెలటూరుతాగేలిలో ఉన్న తన సోదరిని చూడడానికి తల్లితో పాటు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఆమడదూరంలో సోదరి ఇంటికి చేరే క్రమంలో ఎదరుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈ ఘటనలో ఉదయ్‌కిరణ్ తీవ్రంగా గాయపడగా బీఎన్‌కండ్రిగ మండలం తలారివెట్టు పంచాయతీ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనిల్ స్వల్పంగా గాయపడ్డాడు. ఉదయ్ కిరణ్‌ను మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కాగా ఉదయ్‌కిరణ్ తల్లి, మరో క్షతగాత్రుడు అనిల్ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.


ఉదయ్‌కిరణ్ (ఫైల్ ఫొటో)

పాడి రైతులకు దాణా పంపిణీ

ఏర్పేడు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట పరిధిలోని రైతులకు 50శాతం రాయితీతో దాణాను పంపిణీ చేశారు. 50 కిలోల బ్యాగ్ ధర రూ.1,110 కాగా 50శాతం రాయితీతో రూ.555కే ఎస్సీ, ఎస్టీ, పేద రైతులకు అందిస్తామని టీడీపీ నాయకులు చెప్పారు. మండలానికి 500 బ్యాగులు వచ్చాయని, ఏర్పేడు, పల్లం, ఎండీపుత్తూరు, పాపానాయుడుపేట పశువైద్య కేంద్రాల్లో పంపిణీ చేస్తామని పశువైద్యాధికారులు శిల్పారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి చెప్పారు. టీడీపీ నాయకులు పేరం ధనంజయులు నాయుడు, ఆర్.గురవారెడ్డి, పొన్నారావు, పేరం నాగరాజునాయుడు, శివశంకర్‌రెడ్డి, బాలగురునాథంయాదవ్, కృష్ణవేణి, సుబ్రహ్మణ్యం, కేశినేని సుబ్రహ్మణ్యం, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.


దాణా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

విద్యతో పేదరికం దూరం

ఏర్పేడు, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకుంటే పేదరికం దూరమవుతుందని ఐఆర్‌ఎస్ అధికారి జయశంకర్ సూచించారు. పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో అక్కుపల్లి సుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమానికి ఐఆర్‌ఎస్ అధికారి జయశేఖర్, అక్కుపల్లి సుబ్బయ్య ఫౌండేషన్ నిర్వాహకుడు సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జయశేఖర్ మాట్లాడుతూ... ఫౌండేషన్ ద్వారా అక్కుపల్లి మహేష్ విద్యార్థులను ప్రోత్సహించడానికి మంచి కార్యక్రమాన్ని ఎన్నుకున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన 14 మందికి తలా రూ.5వేలు, మరో 14 మందికి తలా రూ.3వేలు అందజేశారు. ఎంఈవో దయాకర్, శ్రీకాళహస్తి ఎంఈవో బాలయ్య, పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

వృద్ధురాలి అదృశ్యం

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వృద్ధురాలు అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. తొట్టంబేడు మండలం పెద్దసింగమాలకు చెందిన శ్యామలాదేవి(69) అదృశ్యమైంది. కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ తెలియకపోవడంతో శనివారం శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు రామకృష్ణ ఆశ్రమంలో బుద్ధ జయంతి

ఏర్పేడు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులపాళెంలో ఉన్న శ్రీరామకృష్ణ ఆశ్రమంలో బుద్ధ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్టు గోపి మాస్టర్ చెప్పారు. బుద్ధుడి జీవితచరిత్రపై క్విజ్ పోటీలను నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.7,500, రెండో బహుమతిగా రూ.5వేలు, మూడో బహుమతి రూ.2,500 ఇవ్వనున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ

నారాయణవనం, మే 10(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం అంకురార్పణతో ప్రారంభించారు. ఈనెల 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. సేనాపతి ఉత్సవంలో విష్వక్సేనుడు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడ వీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్యకైంకర్యాలను నిర్వహించారు. సాయంత్రం గంట నైవేద్యాలు నిర్వహించారు. అనంతరం స్థానిక భావనారుషి ఆలయం నుండి పద్మశాలీలు కొడి వస్త్రాన్ని మేళతాళాలతో తీసుకువచ్చి ఆలయ అర్చకులు అందజేశారు. సేనాపతి ఉత్సవంలో భాగంగా మృత్స్యగ్రహణం, పుట్టమట్టిని పాలికలో నింపి నవధాన్యాలను మొలకెత్తించే కార్యక్రమాలను అర్చకులు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో ఉత్సవర్ల ఊరేగింపు కొనసాగే స్థితిగతుల పర్యవేక్షణకు విష్వక్సేనుడు తిరుచ్చి వాహనంపై మాడవీధుల్లో విహరించారు. వార్షిక బహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. ఆలయంలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ చేశారు.

నేడు ధ్వజారోహణం

ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు, శ్రీనివాసరాఘవ, నరసింహ భట్టాచార్యులు మాట్లాడుతూ ఈనెల 11న ఆదివారం ఉదయం 3 గంటలకు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తి చేసి గరుడాళ్వార్ చిత్రపటాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపచేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.



గంగమ్మ జాతరకు పటిష్ఠ భద్రత కల్పించండి



శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతరకు పటిష్ఠ భద్రత కల్పించాలని కమిటీ నిర్వాహకులు డీఎస్పీ నరసింహమూర్తిని కోరారు.బీపీ అగ్రహారంలో 13, 14 తేదీల్లో గంగమ్మజాతర జరగనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు జాతర కమిటీ సభ్యులు శనివారం డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. జాతర ప్రశాంతంగా జరిగేలా భద్రతను ఏర్పాటు చేయాలని కోరారు.

దివంగత ఎంపీపీ నటరాజపిళ్లై సతీమణి మృతి

సత్యవేడు, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మాజీ ఎంపీపీ, దివంగత నటరాజపిళ్లై సతీమణి ఎల్లమ్మ(70) మృతి చెందారు. సమాచారం తెలుసు కున్న నియోజకవర్గంలోని వివిధ రాజకీయ ప్రముఖులు తరలివచ్చి ఆమె భౌతిక కాయానికి నివాళు లర్పించారు. కాగా ఎల్లమ్మకు ఇద్దరు కుమా రులు. ఒకరు టీడీపీ మండల మాజీ అధ్య క్షుడు పరమశివం, మరొకరు పళ్లికొండేశ్వ రాలయ మాజీ చైర్మన్ తిరునీలకంఠం. ఎల్లమ్మ అంత్యక్రియలను శనివారం సాయం త్రం నిర్వహించారు.


ఎల్లమ్మ(ఫైల్)

టీడీపీ కార్యకర్తలకు బీమా సొమ్ము అందజేత

శ్రీకాళహస్తి, మే 10(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇద్దరు కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున టీడీపీ నాయకులు బీమా సొమ్మును అందజేశారు. మండలంలోని ఉడమలపాడుకు చెందిన మునిప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ ఆధ్వర్యంలో మునిప్రసాద్ పార్టీలో చురుగ్గా పనిచేస్తూ సభ్యత్వం స్వీకరించారు. ప్రమాదవశాత్తు ఆయన మృతి చెందడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి బీమా సొమ్మును మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు ఉడమలపాడుకు చేరుకుని మునిప్రసాద్ కుటుంబానికి బీమా నగదు చెక్కును అందజేశారు. ఏర్పేడు మండలం రాజులపాళెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మధు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అదే తరహాలో పార్టీ రూ.5లక్షలు బీమా సొమ్మును మధు కుటుంబానికి మంజూరు చేసింది. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.గురవారెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి ప్రమాద చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పొన్నారావు, నాయకులు చెంచయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, గుర్రప్ప నాయుడు, మురగయ్య, జగదీష్ నాయుడు, శేషంనాయుడు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


మునిప్రసాద్ కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న చెంచయ్యనాయుడు తదితరులు

సారాను నిర్మూలిద్దాం

ఏర్పేడు, మే 10(ఆంధ్రజ్యోతి): సారాను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుపతి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవాచారి, శ్రీకాళహస్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య చెప్పారు. ఏర్పేడు మండలంలోని ముసలిపేడు పంచాయతీ బత్తినయ్యగిరిజన కాలనీలో శనివారం నవోదయం 2.0 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సిబ్బంది, సర్పంచ్, అటవీశాఖ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బత్తినయ్యగిరిజన కాలనీలో నవోదయం సమావేశం

సోమనాథేశ్వరాలయంలో శని త్రయోదశి పూజలు

పిచ్చాటూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగ సోమనాథేశ్వర ఆలయంలో శనివారం సాయంత్రం నందీశ్వరుడికి మహా ప్రదోష పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ పూజల్లో పాల్గొంటే సర్వ దోషాలన్నీ తొలగిపోతాయి అన్నది స్థానికుల ప్రగాఢ విశ్వాసం దీంతో ప్రదోష క్షేత్రంగా విరాజిల్లుతున్న సోమనాథేశ్వర ఆలయంలో మహా ప్రదోష కాల పూజలు వేద పండితులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు ఏర్పాట్లు చేశారు.

అంగన్‌వాడీల్లో కిశోర వికాసం

ఏర్పేడు, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిళ్లవారికండ్రిగ, ఎండీ పుత్తూరు సచివాలయాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు యుక్తవయసులో వచ్చే మార్పులను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి వివరించారు. బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, హెల్త్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎం ధనలక్ష్మి, ఎంఎస్‌కే ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

అమాయకులే లక్ష్యం!

- పుత్తూరు కేంద్రంగా నకిలీ బంగారం విక్రయం
- రూ.4 లక్షల దోపిడీ
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

పుత్తూరు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): అమాయకులను లక్ష్యంగా చేసుకుని నకిలీ బంగారం విక్రయించే ముఠా దోపిడీకి పాల్పడుతోంది. ఇటీవల పుత్తూరులో ఓ చిరుదుకాణం ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకునే దంపతులనుంచి రూ.4 లక్షలు దోచుకెళ్లారు. సీఐ సురేంద్రనాయుడు తెలిపిన వివరాలు... గోవిందప్పనాయుడు కండ్రిగకు చెందిన చెంచయ్య నాయుడు, స్వప్న దంపతులు తమ కుమార్తె షర్మిళతో కలిసి జెండామాను ఎక్స్‌టెన్షన్ వీధిలో నివాసం ఉంటున్నారు. లక్ష్మి అనే మహిళ దుకాణానికి వచ్చి పోతూ ఆ భార్యాభర్తలతో పరిచయం పెంచుకుంది. తాము ఇంటి నిర్మాణం చేసే సమయంలో బంగారం దొరికిందని ఆ దంపతులకు చెప్పింది. తెలిసిన వారికి మాత్రమే విక్రయిస్తామని నమ్మించింది. తక్కువ ధరకే బంగారం వస్తుందని ఆ దంపతులు ఆశపడ్డారు. వారికి అనుమానం కలగకుండా ముందుగా మేలిమి బంగారాన్ని ఇచ్చి పరిశీలించుకోమని నమ్మబలికింది. వారు ఆ బంగారాన్ని బజారువీధిలో తెలిసిన ఆచారి వద్దకు వెళ్లి పరిశీలించుకున్నారు. బంగారం స్వచ్ఛమైనదని ఆ ఆచారి చెప్పడంతో మిగిలిన బంగారు కొనుగోలుకు ఆ దంపతులు సిద్ధపడ్డారు. ఇంట్లో దాచుకున్న రూ.లక్షతో పాటు తమ వద్ద ఉన్న బంగారాన్ని కుదవ పెట్టి మరో రూ.3 లక్షలు వెచ్చించి బంగారు బిస్కెట్‌ను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన బంగారు ఎవరికీ చూపొద్దని, ఆచారికి చూపితే అనుమానం వస్తుందని, రెండు రోజుల తరువాత పరిశీలించుకోమని లక్ష్మి వారికి సూచించింది. ఆమె చెప్పిన విధంగానే రెండురోజుల తరువాత ఆ బిస్కెట్‌ను తీసుకెళ్లి ఆచారికి చూపగా అది నకిలీ బంగారంగా గుర్తించాడు. అప్పటికే ఆ మహిళ పరారవడంతో తాము మోసపోయామని గ్రహించిన దంపతులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు మోసం చేసిన ఆ మహిళ ఫోన్‌కు కాల్ చేయగా గుంటూరు చిరునామా వస్తోందని సీఐ తెలిపారు. అంతే కాకుండా ఆమె వినియోగించిన వాహన నెంబర్ ను పరిశీలిస్తే పీలేరు సమీపంలోని సోమల చిరునామా చూపుతోందన్నారు. ఈ సంఘటన గత నెల 29న చోటుచేసుకోగా, బాధితులు ఫిర్యాదు మేరకు ఈనెల 3వ తేదీన కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఓబయ్య పేర్కొన్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు.

15నుంచి ఏఐవైఎఫ్ జాతీయ సభలు

శ్రీకాళహస్తి మే 10(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమైందని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య చెప్పారు. తిరుపతిలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల పోస్టర్లను చెర్లోపల్లిలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. దేశంలో యువత, విద్యార్థుల సమస్యలపై ఈ సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మునిచందు, మధు, ఉపేంద్ర, ధనుష్ పాల్గొన్నారు.

దాహార్తి తీర్చండి

వరదయ్యపాళెం, మే 10(ఆంధ్రజ్యోతి): తమ దహార్తిని తీర్చాలని మహిళలు వేడుకున్నారు. మండలంలోని గోవర్ధనపురంలో గత నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో తాగునీరు సరఫరా చేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

ఆదర్శ పాఠశాల, కేజీబీవీల్లో ప్రవేశాలు ప్రారంభం

కేవీబీపురం, మే 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు దరఖాస్తుదారులు వారి ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో హాజరుకావాల్సి ఉందన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి కూడా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. వారి ఫోన్లకు వచ్చిన మెసేజీల ఆధారంగా కావాల్సిన ధృవీకరణ పత్రాలతో వచ్చి పాఠశాలలో చేరాల్సిందిగా ఏవో సుకన్య తెలిపారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యేలు

శ్రీకాళహస్తి మే 10(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం విశాఖ జిల్లా మాడుగుల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గాలి భానుప్రకాష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, టీడీపీ యువనాయకుడు నాగమల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.